సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 9 । జూన్ । 2023



ఉప్పొంగిన అభిమానం

క్యాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరణపై హర్షం వ్యక్తమైంది. విశాఖ కలెక్టరేట్ వద్ద సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.



అంశాలన్నీ ఆమోదం

విశాఖ: జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశంలో అజెండాలోని 22 అంశాలు, 2 టేబుల్ అంశాలు ఆమోదం పొందాయి.



రైలు ప్రమాద మృతులకు నివాళి

విశాఖ: ఒడిశా రైలు ప్రమాద మృతులకు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు.

న్యూస్‌రీల్

బీసీ గురుకులాల్లో ఖాళీ సీట్ల భర్తీకి ఆహ్వానం

నర్సీపట్నం : మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన సంక్షేమ తరగతుల గురుకుల విద్యాలయాల్లో 6 నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురుకులాల జిల్లా కన్వీనర్, ప్రిన్సిపాల్ ఎస్. వెంకటరెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి, నర్సీపట్నం, తానాం, చోడవరం, పాయకరావుపేట గురుకుల పాఠశాలలో ఖాళీ సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థులు ఈ నెల 12లోపు సమీపంలో ఉన్న పాఠశాలల్లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వచ్చిన దరఖాస్తుల ఆధారంగా ఈ నెల 17న ప్రవేశ పరీక్ష నిర్వహించి, విద్యార్థులను ఎంపిక చేయనున్నట్టు పేర్కొన్నారు.

రేంజర్‌పై చర్యలకు సిఫార్సు

నర్సీపట్నం: తూనిక కలపగా నిర్ధారించి కలప వ్యాన్ వదిలిపెట్టిన సంఘటనలో నర్సీపట్నం రేంజర్ లక్ష్మీనర్సు న్యాయబద్ధంగా విధులు నిర్వర్తించలేదని తన విచారణలో రుజువైనందున చర్యలు తీసుకోవాలని పీసీసీఎఫ్‌కు, సీసీఎఫ్‌కు సూచించానని డీఎఫ్‌వో రాజారావు తెలిపారు. అటవీశాఖ ఆదాయం పెంపునకు చర్యలు చేపట్టామన్నారు. దీనిలో భాగంగా 2,500 యూకలిప్టస్ చెట్లకు ఇటీవల ఈ వేలం పాట నిర్వహించామన్నారు. యూకలిప్టస్ చెట్ల వేలం ద్వారా అటవీశాఖకు రూ.18 కోట్ల ఆదాయం సమకూరిందన్నారు.

రూ.10 కోట్లతో 100 ఆలయాల నిర్మాణం



వినాయకుడి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్యే గణేష్

నాతవరం: నర్సీపట్నం నియోజకవర్గంలో రూ.10 కోట్లతో వంద ఆలయాలు నిర్మించి పూజా కార్యక్రమాలు ప్రారంభిస్తున్నామని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. వై.బి.పట్నంలో రూ.10 లక్షలతో నిర్మించిన వినాయకుడి ఆలయ ప్రారంభోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి తాను ఏ పని తలపెట్టినా నియోజకవర్గంలో మొదటిగా నాతవరం మండలంలోనే ప్రారంభించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. మిగతా ఆలయాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు దృష్టి సారించాలన్నారు. వైస్ ఎంపీపీ పైల సునీల్, గన్నవరం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి గొర్లె వరహాలబాబు, సర్పంచ్ గొర్లె వీర వెంకట సత్యవేణి, ఇన్‌చార్జి ఎంపీడీవో పోలుపర్తి పార్థసారథి, పార్టీ మండలాధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, పామాయిల్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు పైల పోతురాజు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఉల బాల శ్రీను, ముత్తా శివాజీ, ఏఎంసీ డైరెక్టర్లు అడిగర్ల నాయుడు, బండి గంగరాజు, సర్పంచులు జి. సోమన్నదొర, పాతాళ అప్పారావు, లోకారపు రాము, గన్నవరం బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

చల్లని తల్లి నూకాంబిక

- పిలిస్తే పలుకుతుంది.. కష్టాలు తీరుస్తుంది..
- శారద పీఠాధిపతి స్వామి స్వరూపానందేంద్ర సరస్వతి
- అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం
- రూ.10 కోట్లతో రాతి కట్టడం : మంత్రి అమర్‌నాథ్



హోమంలో పాల్గొన్న స్వామి స్వరూపానందేంద్ర సరస్వతి, మంత్రి అమర్‌నాథ్



నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న స్వరూపానందేంద్ర సరస్వతి, మంత్రి అమర్‌నాథ్, దాడి రత్నాకర్

అనకాపల్లి టౌన్: భక్తులకు ఎటువంటి సమస్య వచ్చినా 'అమ్మా.. నీదే భారం' అని వేడుకుంటే చాలు నూకాంబిక కరుణ కురిపిస్తుందని, కష్టం తీరుస్తుందని విశాఖ శారద పీఠాధిపతి స్వామి స్వరూపానందేంద్ర సరస్వతి అన్నారు. నూకాలమ్మ శక్తిస్వరూపిణి అని, ఆమెను భక్తిశ్రద్ధలతో పూజించిన వారికి అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని చెప్పారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖల మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తో కలిసి స్వామీజీ నూకాంబిక అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి గురువారం ఉదయం శంకుస్థాపన చేశారు. దేవదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భూమి పూజ చేసిన అనంతరం శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ అమ్మవారి ఆలయానికి వందల సంవత్సరాల చరిత్ర ఉందని, తెలుగు రాష్ట్రాల ప్రజలు అమ్మవారిని దర్శించుకొని, మొక్కులు సమర్పించుకోవడం ఆనవాయితీగా వస్తోందని పేర్కొన్నారు. ప్రతి రోజూ వేలాదిమంది దర్శించుకునే ఈ ఆలయాన్ని పునర్నిర్మించడం ఎంతో ఆనందదాయకమన్నారు.

8 నెలల్లో పూర్తి చేస్తాం: మంత్రి అమర్‌నాథ్

మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ అమ్మవారి ఆలయాన్ని రూ.10 కోట్లు వెచ్చించి, రాతి కట్టడంతో సర్వాంగ సుందరంగా పునర్నిర్మిస్తామన్నారు. ఈనెలాఖరున పనులు ప్రారంభవుతాయని, 8 నెలల్లో ఆలయ నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పారు. ఈ పనులకు దేవదాయశాఖ రూ.7 కోట్లు వెచ్చిస్తుండగా.. తిరుమల తిరుపతి దేవస్థానం రూ.3 కోట్లు అందజేస్తోందని చెప్పారు. టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి అమ్మవారి దర్శనానికి వచ్చిన సమయంలో టీటీడీ నుంచి సహాయం కోరామని, విన్నపాన్ని మన్నించి నిధులు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ప్రతి ఏడాది అమ్మవారి జాతర ఉగాది ముందురోజు నుంచి నెలరోజులపాటు అంగరంగ వైభవంగా జరుగుతుందని, నిత్యం భక్తులు పెద్దసంఖ్యలో దర్శిస్తూ ఉంటారని చెప్పారు. ఆది, మంగళ, గురువారాల్లో రోజుకు సుమారు 70 వేల మంది భక్తులు ఆలయానికి వస్తున్నట్లు తెలిపారు. ఈ తాకిడిని దృష్టిలో పెట్టుకొని భవిష్యత్తులో కూడా దర్శనాలకు ఇబ్బంది లేకుండా గుడిని నిర్మిస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ మాట్లాడుతూ భక్తుల తాకిడిని దృష్టిలో పెట్టుకుని నిర్మాణపనులు చేపడుతున్నట్లు చెప్పారు. ఆలయానికి వచ్చే భక్తులు పునర్నిర్మాణ పనులకు సహకరించాలని కోరారు. తొలుత యాగశాలలో హోమం నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని దేవదాయశాఖ డీసీ ఎస్.సుజాత ప్రారంభించారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్, కార్పొరేటర్లు కొణతాల నీలిమ, పీలా లక్ష్మీసౌజన్య, వైఎస్సార్‌సీపీ నాయకులు పి.రాంబాబు, కె.భాస్కరరావు, దాడి జయవీర్, దేవాదాయశాఖ డిప్యూటీ ఇంజనీర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి

- వైస్ చైర్మన్‌గా రామకృష్ణ ఎన్నిక



సుబ్బలక్ష్మి, రామకృష్ణలకు నియామక పత్రాలు అందజేస్తున్న ఆర్వో జయరాం, పక్కన ఎమ్మెల్యే ఉమాశంకర గణేష్

నర్సీపట్నం: మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ పదవులకు మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో గురువారం ఎన్నిక జరిగింది. చైర్‌పర్సన్‌గా (ఎస్సీ మహిళకు రిజర్వు) 12వ వార్డు కౌన్సిలర్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్‌గా ఎనిమిదో వార్డు కౌన్సిలర్ కోనేటి రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి, వైస్ చైర్మన్ గొలుసు నర్సింహమూర్తి పదవులకు రాజీనామా చేయడంతో ఎన్నిక అనివార్యమైంది. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో హెచ్.వి.జయరాం, అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కమిషనర్ కె.కనకారావు ఎన్నిక నిర్వహించారు. వైఎస్సార్‌సీపీకి చెందిన 15 మంది కౌన్సిలర్లతో పాటు ఎక్స్‌అఫీషియా సభ్యుడైన ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ హాజరయ్యారు. టీడీపీకి చెందిన 12 మంది కౌన్సిలర్లు, జనసేన కౌన్సిలర్ హాజరు కాలేదు. ఎన్నికల నిబంధనల మేరకు కోరం సరిపోవడంతో రిటర్నింగ్ అధికారి ఎన్నిక నిర్వహించారు. సుబ్బలక్ష్మి, కోనేటి రామకృష్ణలకు మద్దతుగా 15మంది కౌన్సిలర్లతో పాటు ఎమ్మెల్యే చేతులెత్తి మద్దతు తెలియజేశారు. విజేతలకు ఎన్నికల అధికారి నియామక పత్రాలు అందజేసి, వారి చేత ప్రమాణం చేయించారు.

ఎన్నిక అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో అనుకున్న ఒప్పందం మేరకు చైర్‌పర్సన్‌గా సుబ్బలక్ష్మి, వైస్‌చైర్మన్‌గా కోనేటి రామకృష్ణకు అవకాశం కల్పించామన్నారు. నూతనంగా ఎన్నికైన వారు సమర్థవంతంగా పనిచేసి మున్సిపాలిటీకి మంచి పేరు తీసుకురావాలన్నారు.

అనంతరం సుబ్బలక్ష్మి, రామకృష్ణ మాట్లాడుతూ అవకాశం కల్పించిన ఎమ్మెల్యేకు, మద్దతుగా నిలిచిన కౌన్సిలర్లకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎమ్మెల్యే సహకారంతో మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్‌గా ఆనందలక్ష్మి



అనకాపల్లి టౌన్: జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్‌గా కె.ఆనందలక్ష్మి గురువారం స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానంలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీ నూకాంబిక అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుంచి క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. జగనన్న క్రీడా క్లబ్‌ల ద్వారా వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహించారని, క్రీడల్లో పాల్గొనే పిల్లలకు సర్టిఫికేట్లు అందజేస్తున్నట్లు ఆమె చెప్పారు. విజయనగరం, చిత్తూరు జిల్లాల్లో జిల్లా క్రీడాధికారిగా, రంగారెడ్డి, వరంగల్, విశాఖ, శ్రీకాకుళం జిల్లాల్లో చీఫ్ కోచ్‌గా విధులు నిర్వహించినట్లు ఆమె పేర్కొన్నారు. ఇక్కడ విధులు నిర్వహించిన చీఫ్ కోచ్ నాగిరెడ్డి పదవీ విరమణ చేశారు.

రామభద్రరాజుకు కన్నీటి వీడ్కోలు



తంగేడులో ప్రజల సందర్శనార్థం ఉంచిన రామభద్రరాజు పార్థివదేహం

కోటవురట్ల : మూడు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ ప్రయాణం. పదవులు.. పురస్కారాల కంటే ప్రజాసేవలో జనాల కళ్లల్లో కనిపించే వెలుగే తన ఆనందంగా జీవించిన ఏటికొప్పాక సుగర్ ఫ్యాక్టరీ మాజీ చైర్మన్ ఆర్ఎస్ రామభద్రరాజు అంతిమయాత్ర బంధువులు, అభిమానులు, రాజకీయ ప్రముఖుల సమక్షంలో గురువారం ముగిసింది. ఆయన పార్థివ దేహం వెంట తంగేడు తరలి వెళ్లింది. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజలు, ప్రముఖులు ఘన నివాళి అర్పించి, కన్నీటి వీడ్కోలు పలికారు. కుటుంబ సభ్యులు మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆర్ఎస్ రామచంద్రరాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్ఎస్ సీతారామరాజు, రాంబాబురాజు, సత్యనారాయణరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు చింతకాయల సన్యాసిపాత్రుడు, పలు పార్టీల నాయకులు, ప్రజలు నివాళి అర్పించి, ఆయన కుమారుడు సతీష్‌రాజుకు మానసిక స్థైర్యం అందించారు. రామభద్రరాజు మృతికి శ్రీ మరిడిమాంబ వర్తక సంఘం సంతాపం తెలిపింది. ఈ సందర్భంగా దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేశారు.

అయ్యవార్లు అడ్డదారులు..!

- ఆనందపురం మండలం ఎంపీయూపీఎస్ వెంకటాపురంలో స్కూల్ అసిస్టెంట్ సోషల్ పోస్టును రేషనలైజేషన్‌లో చూపించారు. అక్కడ పనిచేసే ఉపాధ్యాయుడు బదిలీల్లో తప్పనిసరిగా మరోచోటకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. కానీ పోస్టు రేషనలైజేషన్‌కు గురికాలేదనే తప్పుడు సమాచారం నమోదు చేశారు. ఆ ఉపాధ్యాయుడికి తెలిసో, తెలియకో ఇలా చేసినా, పర్యవేక్షణాధికారిగా ఉన్న ఎంఈవో దీన్ని సరిదిద్దాలి.
- సబ్బవరం మండల కేంద్రంలోని హైస్కూల్‌లోని ఓ ఉపాధ్యాయురాలు ఎనిమిదేళ్లు సర్వీసు నిండకున్నా, దరఖాస్తులో మాత్రం 'ఎస్' గుర్తించటంతో అక్కడి పోస్టు ఖాళీగా ఉన్నట్లు జాబితాలోకి చేరింది. దీంతో అనివార్యంగా సదరు ఉపాధ్యాయురాలు గాల్లో ఉండాల్సిన పరిస్థితి తలెత్తింది. ఎంఈవో సరైన పరిశీలన చేయకపోవటంతోనే ఈ సమస్యకు కారణంగా గుర్తించిన ఉన్నతాధికారులు మెమో జారీ చేశారు.

- బదిలీల్లో ఇష్టారాజ్యం
- 106 మందికి మెమోలు జారీ
- జాబితాల పరిశీలనలో అలసత్వం
- డీఈవో కార్యాలయంలో ఓ యూనియన్ గుత్తాధిపత్యం
- ఖాళీలు చూపించటంలో అధికారుల నిర్లక్ష్యం
- ఫిజికల్ డైరెక్టర్లకు తీవ్ర నష్టం



చోడవరం బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా విధుల్లో చేరిన రామిరెడ్డి

విశాఖ విద్య : ఉమ్మడి విశాఖ జిల్లాలో 106 మంది ఉపాధ్యాయులు వెబ్‌సైట్‌లో పొందుపరిచిన బదిలీ దరఖాస్తులో దొర్లిన తప్పిదాలను ఉన్నతాధికారులు గుర్తించారు. పూర్తి స్థాయిలో అవగాహన లేకనే చాలా మంది ఉపాధ్యాయులు ఇలా చేశారని చెబుతున్నా, పర్యవేక్షణాధికారులుగా ఉన్న ప్రధానోపాధ్యాయులు, ఎంఈవో, డిప్యూటీ డీఈవోలు తగిన రీతిలో పరిశీలన చేయలేదనేది దీని ద్వారా తేటతెల్లమైంది. జరిగిన తప్పిదంతో ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తి కాకున్నా, ఆ చోటు వెబ్‌సైట్‌లో ఖాళీల జాబితాల్లో కనిపించటం వల్ల వేరే ఉపాధ్యాయులు కోరుకున్నారు. ఫలితంగా ఒకే చోట ఇద్దరేసి ఉపాధ్యాయులు ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. విశాఖ రైల్వే కాలనీ స్కూల్లో ఇద్దరు ఉపాధ్యాయుల మధ్య తలెత్తిన ఇటువంటి వివాదం విద్యాశాఖాధికారుల మెడకు చుట్టుకునేలా కనిపిస్తోంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో 106 మంది ఉపాధ్యాయులు, వారి పర్యవేక్షణాధికారులకు మెమోలు జారీ కావటం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. విశాఖ జిల్లాలో 54 వరకు పీడీ పోస్టులు ఉండగా, 21 మాత్రమే ఖాళీలను వెబ్‌సైట్‌లో ఉంచటం వల్ల, అనివార్యంగా అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు బదిలీపై వెళ్లాల్సి వస్తోందని పలువురు ఫిజికల్ డైరెక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేసే ఓ ఉపాధ్యాయ సంఘం నాయకులు డీఈవో కార్యాలయంలోనే తిష్ట వేసి, గుత్తాధిపత్యం చేస్తుండడంతోనే తప్పిదాలు చోటుచేసుకుంటున్నాయని ఉపాధ్యాయులు విమర్శిస్తున్నారు. ఏదైనా తప్పిదాలు జరిగితే, పర్యవేక్షణాధికారుల నుంచి వివరణ కోరి, తదుపరి చర్యలు తీసుకుంటామని ఉమ్మడి విశాఖ జిల్లా బదిలీల ప్రత్యేకాధికారి ఎం.జ్యోతికుమారి చెప్పారు.

బదిలీ ఉత్తర్వులు విడుదల

146 మంది గ్రేడ్-2 హెచ్‌ఎంల బదిలీల ఉత్తర్వులు బుధవారం సాయంత్రం విడుదల కాగా, వీరంతా గురువారం విధుల్లో చేరారు. స్కూల్ అసిస్టెంట్‌లకు శుక్రవారం సాయంత్రానికి పూర్తి స్థాయిలో ఉత్తర్వులు జారీ కానున్నాయి.

సహకార సంఘాల ఆర్థికాభివృద్ధికి కృషి

- డీసీసీబీ చైర్‌పర్సన్ చింతకాయల అనిత



మాట్లాడుతున్న బ్యాంక్ చైర్‌పర్సన్ చింతకాయల అనిత

గోపాలపట్నం (విశాఖ): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తామని విశాఖ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్‌పర్సన్ చింతకాయల అనిత అన్నారు. మర్రిపాలెం వుడా లే అవుట్‌లోని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ కార్యాలయంలో మహాజన సభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆర్థిక అభివృద్ధికి రాష్ట్ర స్థాయిలో అడ్వైజరీ కమిటీ ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఈ కమిటీ ద్వారా సహకార సంఘాల బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. 2022 – 23 ఆర్థిక సంవత్సరానికి రూ.1.48 కోట్ల లాభాన్ని ఆర్జించామని తెలిపారు. బ్యాంక్ ఆర్జించిన లాభం నుంచి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల షేరు ధనంపై 6 శాతం వడ్డీ అందజేస్తున్నామని తెలిపారు. ఉద్యోగులకు సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి డీవీఎస్ వర్మ, ఆప్కాబ్ డీజీఎం పీబీ ప్రత్యూష, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

ప్రేమ... పగ!

- ప్రేమించి, పెళ్లాడిన భార్యకు నిత్యం వేధింపులు
- విడాకులు కోరిందని కసితో హత్య చేసిన భర్త
- అచ్యుతాపురం లాడ్జిలో వివాహిత మృతి కేసులో వీడిన మిస్టరీ
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ సత్యనారాయణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ సత్యనారాయణ

అచ్యుతాపురం (అనకాపల్లి): అతనిది గాజువాక.. ఆమెది అగనంపూడి. ఇద్దరివీ వేర్వేరు కులాలు...ఇద్దరూ ఇష్టపడ్డారు...పెద్దలకు ఇష్టం లేకపోయినా పెళ్లి చేసుకున్నారు. అయితే మూడు నెలల్లోనే ప్రేమ కాస్తా ఆవిరైపోయింది. ఆమెకు కట్నం కోసం అత్తింటి వేధింపులు మొదలయ్యాయి. దానికి భర్త వేధింపులు తోడయ్యాయి. దీంతో మూణ్నాళ్లకే వారి ప్రేమ పెళ్లి మూణ్నాళ్ల ముచ్చటైంది. విసిగి వేసారిన భార్య విడాకులు కోరడంతో ప్రేమించిన భర్త పగబట్టాడు. భార్య ఉసురు తీశాడు. అచ్యుతాపురంలోని లాడ్జిలో గత నెల 29వ తేదీన మహాలక్ష్మి అనే వివాహిత హత్య కేసులో వెలుగు చూసిన విషయాలివి. ఈ కేసులో మృతురాలు తండ్రి ఎస్.సాంబ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 302 సెక్షన్, ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేశారు. వివరాలను పరవాడ డీఎస్పీ సత్యనారాయణ గురువారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

గాజువాక బీసీ కాలనీకి చెందిన శ్రీనివాస్, అగనంపూడిలో నివాసముంటున్న స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి సాంబ కుమార్తె మహాలక్ష్మి మూడేళ్ల క్రితం ప్రేమించుకున్నారు. పెద్దల అంగీకారం లేనప్పటికీ పెళ్లి చేసుకున్నారు. వారి కాపురం మూడు నెలల వరకూ సజావుగా సాగింది. ఎస్టీ లంబాడీ కులానికి చెందిన మహాలక్ష్మికి వంటలు రావని, కట్నం తేలేదని శ్రీనివాస్‌తో పాటు అతని కుటుంబ సభ్యులు చిన్నచూపుతో వేధించడం మొదలుపెట్టారు. దీనిని భరించలేక మహాలక్ష్మి పుట్టింటికి వెళ్లిపోయింది. అయినా శ్రీనివాస్ వేధింపులు మానలేదు. రాంబిల్లి మండలంలో రైతు భరోసా కేంద్రంలో పనిచేస్తున్న మహాలక్ష్మిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశాడు. అతని వేధింపులు తట్టుకోలేని మహాలక్ష్మి దువ్వాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేస్తామని చెప్పిన పోలీసులు మృతురాలు తనకు భర్త నుంచి విడాకులు కావాలని కోరడంతో ఫ్యామిలీ కోర్టులో తేల్చుకోమని సూచించారు. దీంతో విడాకుల కోసం ఫ్యామిలీ కోర్టుని ఆశ్రయించిన మహాలక్ష్మిపై శ్రీనివాస్ పగ పెంచుకున్నాడు. పథకం ప్రకారం గత నెల 29న అచ్యుతాపురంలోని లాడ్జిలో రూం తీసుకొని మహాలక్ష్మికి ఫోన్ చేశాడు. మంచిగా మాట్లాడి లాడ్జికి రమ్మని కోరాడు. అతని మాటలు నమ్మిన మహాలక్ష్మి భర్తను కలవడానికి వెళ్లింది. అప్పటికే రెండు కత్తులు, మత్తు ఇంజక్షన్లు, ట్యాబ్‌లెట్లు సిద్ధం చేసుకున్న శ్రీనివాస్ మహాలక్ష్మిపై సాయంత్రం 4 గంటలకు కత్తులతో విచక్షణారహితంగా దాడి చేసి పొడిచాడు. ఆమె అరుపులు విని పక్కరూంలో ఉన్న వారు లాడ్జి మేనేజర్‌కు తెలపగా, వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు రంగంలోకి దిగి లాడ్జి తలుపులు తోసి లోపలకు వెళ్లగా రక్తపు మడుగులో మహాలక్ష్మి, బాత్‌రూంలో శ్రీనివాస్ పడి ఉన్నారు. వెంటనే ఇద్దరినీ అనకాపల్లి ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తీసుకెళ్తుండగా మహాలక్ష్మి మృతి చెందింది. శ్రీనివాస్ రెండు రోజుల తర్వాత కోలుకున్నాడు. ఈ నెల 8వ తేదీ ఉదయం శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా, జరిగినదంతా వెల్లడించాడని డీఎస్పీ విలేకరులకు తెలిపారు. విడాకులు ఇస్తే తన జీవితం నాశనం అవుతుందని, తన లాగే మహాలక్ష్మి జీవితం నాశనం కావాలనే కక్షతో శ్రీనివాస్ ఆమెను హత్య చేసినట్టు తేలిందని డీఎస్పీ పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో సీఐ మురళి పాల్గొన్నారు.

మరణంలోనూ వీడని స్నేహం

- మిత్రుడి పెళ్లికి వెళ్లి ముగ్గురు మృత్యువాత
- బైకు ట్రాక్టరును ఢీకొని ఘోర ప్రమాదం
- శోక సంద్రంలో శ్రీరాంపురం గ్రామం



బైక్‌ను ఢీకొన్న ట్రాక్టర్



కిరణ్‌కుమార్ మృతి చెందడంతో బోరున విలపిస్తున్న తల్లి లక్ష్మి



మృతులు కిరణ్, శివ, వీరబాబు (ఫైల్)

పాయకరావుపేట, తొండంగి (కాకినాడ జిల్లా): కాకినాడ జిల్లా తొండంగి మండలం జి.ముసలయ్యపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పాయకరావుపేట మండలం శ్రీరాంపురం గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు ప్రాణాలు కోల్పోయారు. తొండంగి ఎస్సై రవికుమార్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం విశాఖ జిల్లా పాయకరావుపేట మండలం శ్రీరాంపురానికి చెందిన పోలవరపు కిరణ్ (23), పసుపులేటి దుర్గా శివప్రసాద్ (20), కాకర వీరబాబు(21) స్నేహితులు. వీరు ముగ్గురూ కలిసి బుధవారం రాత్రి బైకుపై స్వగ్రామం నుంచి బీచ్‌రోడ్డు మీదుగా అన్నవరంలో జరిగే స్నేహితుని వివాహానికి బయలుదేరారు. వేమవరం, యర్రయ్యపేట మీదుగా ముగ్గురూ వస్తుండగా జి.ముసలయ్యపేట వద్ద వీరి బైకు ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో పోలవరపు కిరణ్, కాకర వీరబాబులు సంఘటన స్థలంలో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. దుర్గా శివప్రసాద్‌కు తీవ్రగాయాలై ప్రాణాపాయ స్థితిలో ఉండగా స్థానికులు తుని ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాలను తుని ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

కన్నవారికి కడుపు కోత

ఒకరికి తల్లిదండ్రుల్లేరు. మరొకరికి తండ్రి లేడు. ఇంకొకరికి తండ్రి ఉన్నా.. అతని అండ లేదు. కష్టసుఖాల్లో ఒకరికొకరు తోడై ఉండేవారు. కష్టపడి పని చేసుకుంటూ తమ కుటుంబాలకు అండగా ఉన్నారు. వయసులో వారి మధ్య ఏడాది, రెండేళ్ల వ్యత్యాసమే. ఎక్కడికి వెళ్లినా ముగ్గురిదీ ఒకే మాట.. ఒకే వాహనం. అలాంటి మిత్రులను మృత్యువు కూడా ఒకేసారి కాటేసింది. దీంతో ఒకే రోజు మూడు కుటుంబాల్లో విషాదం నెలకొని, గ్రామం మూగబోయింది.

- దుర్గాశివప్రసాద్‌కు తల్లిదండ్రుల్లేరు. చిన్నప్పటి నుంచి మేనత్త రమణమ్మ వద్దే ఉంటున్నాడు. రోడ్డు నిర్మాణానికి ఉపయోగించే మిల్లర్ పని చేస్తూ, ఆమెకు భరోసాగా ఉన్నాడు. ఇతని మరణంతో మేనత్త రమణమ్మ కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది.
- కిరణ్‌కుమార్‌కు తల్లి లక్ష్మి, సోదరి హారిణి ఉన్నారు. తండ్రి బతికే ఉన్నా.. ఆ కుటుంబానికి దూరంగా ఉంటున్నాడని గ్రామస్తులు చెప్తున్నారు. తల్లి స్థానికంగా ఉన్న జీడిపిక్కల ఫ్యాక్టరీలో కూలిపని చేస్తుంది. సోదరి దివ్యాంగురాలు కావడంతో ఆశలన్నీ కిరణ్‌మీదే పెట్టుకున్నారు. కిరణ్ గ్రామంలో కూలి పనులతోపాటు, పెయింటింగ్ పనులకు వెళ్తుంటాడు. త్వరలోనే పెళ్లి చేసేందుకు సంబంధాలు కూడా చూస్తున్నారు. అలాంటి సమయంలోనే తమకు అందరాని దూరాలకు పోయిన కిరణ్‌ను తలచుకుంటూ ఆ తల్లి, కూతుళ్ల శోకం ఊరంతటినీ పట్టి కుదిపేస్తోంది.
- కాకర వీరబాబు మిల్లర్ పనితోపాటు, వ్యాన్ డ్రైవింగ్ చేస్తుంటాడు. తల్లిదండ్రులకు ఒక్కడే కుమారుడు. తండ్రి దారబాబు ఇంటి వద్దనే ఉంటాడు. తల్లి మేరీ గల్ఫ్‌లో ఉన్నట్టు కుటుంబీకులు తెలిపారు. కొడుకు మరణవార్త తెలుసుకుని ఆ తల్లి అక్కడి నుంచి బయలుదేరినట్టు తెలిసింది.

ప్రమాదవశాత్తూ బావిలో పడి వ్యక్తి మృతి


నాగరాజు మృతదేహం

రావికమతం : ప్రమాదవశాత్తూ బావిలో పడి దొండపూడి గ్రామానికి చెందిన కోరుకొండ నాగరాజు(42) అనే వ్యక్తి గురువారం మృతి చెందాడు. ఆయన కథనం మేరకు వివరాలివి. నాగరాజు బుధవారం సాయంత్రం ఇంటివద్ద ఉన్న బావి వద్ద కాళ్లు కడుక్కోవడానికి నీటి కోసం ప్రయత్నించి ప్రమాదవశాత్తూ కాలుజారి బావిలో పడిపోయాడు. దీంతో అక్కడే ఉన్న అతని కుమార్తెలు గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి నాగరాజును బావి నుంచి బయటకు తీసి, సపర్యలు చేశారు. అయినప్పటికీ అతను మృతిచెందాడు. మృతుని భార్య నందిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ విభీషణ రావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఆస్పత్రికి తరలించామన్నారు.

కెనరా బ్యాంక్‌లో చోరీకి యత్నం

యలమంచిలి : మామిడివాడ కెనరా బ్యాంక్‌లో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని ఆగంతకులు చోరీకి యత్నించినట్టు యలమంచిలి రూరల్ ఎస్‌ఐ కె.సన్నిబాబు గురువారం తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు వివరాలివి. యలమంచిలి మున్సిపాలిటీ కట్టుపాలెం రెవెన్యూ పరిధి నారాయణపురం గ్రామంలో ఉన్న రాంబిల్లి మండలానికి చెందిన మామిడివాడ కెనరా బ్యాంకులోకి బుధవారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని ఆగంతకులు చొరబడ్డారు. సీసీ కెమెరాల కనెక్షన్‌లు తొలగించి పక్కనున్న కిటికీ గ్రిల్ తొలగించి, లోపలికి ప్రవేశించి చోరీకి యత్నించారు. బ్యాంకు ముందున్న ఏటీఎంను పగలగొట్టారు. ఈ ఘటనలో బ్యాంకులో ఏటీఎంలో ఉన్న నగదు, ఆభరణాలు ఎటువంటి అపహరణకు గురికాలేదు. బ్యాంక్ మేనేజరు ఎం.కిశోర్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సన్నిబాబు తెలిపారు. కాగా వరుస చోరీలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గత నెలలో రాంబిల్లి మండలంలో స్టేట్ బ్యాంక్‌లోకి ఇదేవిధంగా ఆగంతకులు ప్రవేశించి చోరీకి యత్నించడంతో ఖాతాదారులు బ్యాంకుల్లో డిపాజిట్లు, లాకర్లను వినియోగించుకోవడానికి భయభ్రాంతులకు గురవుతున్నారు. బ్యాంకుల వద్ద 24 గంటలు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.


పగిలిన ఏటీఎంను పరిశీలిస్తున్న ఎస్‌ఐ సన్నిబాబు

సీఎంఆర్ ఎక్స్‌క్లూజివ్ జ్యుయలరీ షోరూం ప్రారంభం

గోపాలపట్నం (విశాఖ పశ్చిమ): గోపాలపట్నంలో సీఎంఆర్ ఎక్స్‌క్లూజివ్ జ్యుయలరీ షోరూంను ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ గురువారం ప్రారంభించారు. మంత్రి అమర్‌నాథ్‌కు సీఎంఆర్ అధినేత మావూరి వెంకట రమణ ఘనంగా స్వాగతం పలికారు. సిల్వర్ విభాగాన్ని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, షోరూం మొదటి అంతస్తులో వెడ్డింగ్ జ్యుయలరీ విభాగాన్ని పశ్చిమ ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ గోపాలపట్నంతో పాటు పరిసర ప్రాంతాలవారికి ఇక్కడేర్పాటు చేసిన సీఎంఆర్ నగల షోరూం ఎంతో అనువుగా ఉంటుందన్నారు. సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ మాట్లాడుతూ గోపాలపట్నంలో అతిపెద్ద బంగారు ఆభరణాల షోరూం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రారంభోత్సవ ఆఫర్‌గా గ్రాము బంగారంపై రూ.200వరకు క్యాష్ బ్యాక్, ఎంత బంగారం కొనుగోలు చేస్తే అంత వెండి ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు. సీఎంఆర్ మేనేజింగ్ డైరెక్టర్ మావూరి మోహన్ బాలాజి మాట్లాడుతూ వినియోగదారుల అభిరుచి తగ్గట్టుగా ప్రాచీన మోడల్ నగల నుంచి ఆధునిక జ్యుయలరీ వరకు అందుబాటులో ఉంచామన్నారు. ఈ సందర్భంగా గుడివాడ అమర్‌నాథ్, మేయర్ హరి వెంకట కుమారి, ఎమ్మెల్యేలు అన్నంరెడ్డి అదీప్‌రాజ్, గణబాబులను సీఎంఆర్ డైరెక్టర్ మావూరి హేమహారిక సత్కరించి జ్ఞాపికలను అందించారు.


సీఎంఆర్ ఎక్స్‌క్లూజివ్ జ్యుయలరీ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

మహిళా కానిస్టేబుల్‌పై ఎస్పీకి ఫిర్యాదు

కశింకోట : స్థానిక పోలీస్ స్టేషన్‌లో పని చేసే మహిళా కానిస్టేబుల్ బాధ్యతారాహిత్యంపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి గురువారం తెలిపారు. ఇటీవల నరసింగబిల్లి రైల్వే స్టేషన్ వద్ద యువతిపై లైంగిక దాడి కేసులో బాధితురాలిని వైద్య పరీక్షలకు ఆస్పత్రికి తరలించేందుకు రావాలని ఈ నెల 5న, రాత్రి 10 గంటల ప్రాంతంలో కోరగా, రాత్రి 2 గంటలకు గానీ విధులకు రాలేదన్నారు. ఆలస్యంపై ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా బదులిచ్చినట్టు వెల్లడించారు. జాప్యం వల్ల బాధితురాలు తీవ్ర ఇబ్బందికి గురయ్యారని పేర్కొన్నారు. దీంతో ఈ విషయమై చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదించామన్నారు.

'లైంగిక దాడి నిందితుడ్ని శిక్షించాలి'

కశింకోట : మండలంలోని నరసింగబిల్లి రైల్వే స్టేషన్ సమీపంలో ఇటీవల యువతిపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా నాయకురాలు డి.డి.వరలక్ష్మి, సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు.

గౌరీ గ్రంథాలయ వార్షికోత్సవం రేపు

అనకాపల్లిటౌన్ : గవరపాలెం గౌరీ గ్రంథాలయం 80వ వార్షికోత్సవాన్ని ఈ నెల 10న నిర్వహించనున్నట్లు గ్రంథాలయం కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదే రోజు సాయంత్రం 4 గంటలకు ప్రముఖ నరాల వ్యాధి నిపుణుడు మళ్ల భాస్కరరావుచే అవగాహన సదస్సు, అనంతరం రోగులకు ఉచిత వైద్య సేవలు, మందుల పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 9247166511 నంబర్లో సంప్రదించాల్సిందిగా కోరారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలివీ..

అనకాపల్లిటౌన్ : విద్యుత్ వైర్ల క్రింద జంగిల్ క్లియరెన్స్‌లో భాగంగా డీ1 సెక్షన్ పరిధిలో ఈ నెల 10న విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయనున్నట్టు ఈపీడీసీఎల్ ఏఈ కె.రాజశేఖర్ గురువారం ఒక ప్రకటలో తెలిపారు. డీ1 సెక్షన్ పరిధిలోని నెయ్యిలవీధి, వేల్పులవీధి, నర్సింగరావుపేట, విజయరామరాజుపేట, ఫైర్ స్టేషన్ రహదారి, మెయిన్‌రోడ్డు కుంచావారివీధి, తాకాశివీధి, కోట్నివీధి, జీవీ కోటేశ్వరరావువీధి తదితర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

అనకాపల్లి సినిమాలు

కస్టడీ	: రాజా
టక్కర్	: సత్యనారాయణ స్క్రీన్-1
పరేషాన్	: సత్యనారాయణ స్క్రీన్-2
ది కేరళ స్టోరీ	: షిర్డిసాయి
విరూపాక్ష	: పర్తిసాయి
అన్‌స్టాపబుల్	: వెంకటేశ్వర
యూనివర్సిటీ	: శ్రీసత్య
బిచ్చగాడు-2	: రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 62 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	--	--
రెండో రకం	4,450	4,450
మూడోరకం	3,700	3,950

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 33 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. బీ పాజిటివ్-9 యూనిట్లు, ఓ పాజిటివ్-21 యూనిట్లు, ఏ నెగిటివ్-1 యూనిట్, బీ నెగిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్ బ్యాంకు ప్రతినిధి గంగయ్య (9848418400) ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 418 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 365 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

అనకాపల్లి.. అభివృద్ధి

మండలంలో పలు అభివృద్ధి పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఎంపీపీ నిధులు రూ.కోటీ 50 లక్షలతో పాటు అదనంగా రూ.39 లక్షలు కేటాయించింది. దీంతో మండలంలో గుర్తించిన సమస్యల్ని ప్రాధాన్యతల వారీగా పూర్తి చేసేందుకు అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నారు.



కొత్తతలారివానిపాలెం రహదారిపై నిలిచిన డ్రైనేజీ నీరు



పిసినికాడ గ్రామంలో నిర్మించిన సీసీరోడ్డు

- మండలంలోని 32 పంచాయతీల్లో జోరుగా అభివృద్ధి పనులు
- ఎంపీపీ నిధులు రూ.కోటీ 50 లక్షలతో అభివృద్ధి
- ప్రభుత్వం నుంచి అదనంగా రూ.39 లక్షలు కేటాయింపు

అనకాపల్లిటౌన్ : మండలంలోని 32 పంచాయతీల్లోని 26 సచివాలయాల పరిధిలో సుమారు 76 వేల మంది జనాభా నివసిస్తున్నారు. గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని నమ్మిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో మౌలిక సదుపాయాల అభివృద్ధికి అవసరమైన మేరకు నిధులు వెచ్చిస్తున్నారు. సీసీరోడ్లు, డ్రైనేజీలు, కమ్యూనిటీ హాల్లు, సచివాలయ బిల్డింగ్‌ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే వీటిలో కొన్ని నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. మిగిలిన మౌలిక వసతులకై తాజాగా నిధులు మంజూరు చేయడం విశేషం.

స్థానికుల అభీష్టం మేరకు..

మండలంలోని కోడూరు, సంపతిపురం, సుందరయ్యపేట, వెంకుపాలెం, సీతానగరం, వెంకన్నపాలెం, పాపయ్యసంతపాలెం, మామిడిపాలెం, మార్టూరు, మాకవరం, తుమ్మపాల, అక్కిరెడ్డిపాలెం, గొలగాం, గోపాలపురం, మారేడు పూడి, తలారివానిపాలెం, గణేష్‌నగర్, సోములూరు తదితర ప్రాంతాల్లో రహదారులు, డ్రైనేజీలు మరమ్మతులకు గురయ్యాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో చాలా వరకు వీటని గుర్తించారు. దీంతో స్థానికుల కోరిక మేరకు, ప్రాధాన్యతల వారీగా పనులు చేపట్టేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు.

- అనకాపల్లి-సబ్బవరం జాతీయ రహదారిని ఆనుకుని శంకరం పంచాయతీ పరిధిలో బొజ్జన్నకొండ రహదారి పూర్తిగా గోతుల మయంగా మారింది. జాతీయ రహదారి నుంచి బొజ్జన్న కొండ వరకూ రూ.9 లక్షల నిధులతో సీసీ రోడ్డును నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.
- గొలగాం పంచాయతీ పరిధి, ఎస్సీ కాలనీలో డ్రైనేజీలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటి మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.15 లక్షల నిధులు విడుల చేసింది. ఈ నిధులతో మూడు రోజుల్లో పనులు ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.
- మండలంలోని మేజర్ పంచాయతీ తుమ్మపాలలో పాడైన కమ్యూనిటీ హాలును ఎంపీపీ నిధులు రూ.15 లక్షలతో అభివృద్ధి చేయనున్నారు.
- మండలంలో కొన్ని ప్రభుత్వ భవనాలు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో కార్యాలయాలకు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఇబ్బందుల దృష్ట్యా మరమ్మతులు పూర్తి చేసేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నారు. మొత్తం వ్యయంపై ప్రతిపాదనలు రూపొందించి, మరమ్మతులు చేపట్టనున్నట్టు అధికారులు చెప్తున్నారు.

గ్రామాల అభివృద్ధికి చర్యలు



దశల వారీగా గ్రామాల్లో సమస్యలను తెలుసుకుని, వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఎంపీపీ నిధులు రూ.కోటీ 50 లక్షలకు ప్రభుత్వం అదనంగా రూ.39 లక్షలు కేటాయించింది. దీంతో స్థానిక ప్రజల అభ్యర్థన మేరకు ప్రాధాన్యతాపరంగా పనులు పూర్తి చేస్తున్నాం. మిగులు పనులు కూడా రెండుమూడు మాసాల్లో పూర్తి చేస్తాం.

– కె.ధర్మారావు, ఎంపీడీవో, అనకాపల్లి

ఘనజీవామృతంతో పంటలకు జీవం



ఘనజీవామృతం తయారీపై లాలం కొత్తూరులో మహిళా సంఘాల రైతులకు అవగాహన

కశింకోట : ఘనజీవామృతం పంటలకు అమృతంలా పని చేస్తుందని మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కూండ్రపు అరుణ అన్నారు. మండలంలోని జి.భీమవరం, లాలంకొత్తూరు, సుందరయ్యపేట తదితర గ్రామాల్లో ఘనజీవామృతం దినోత్సవాన్ని స్వయం సహాయక సంఘాలు, రైతులు, ప్రకృతి వ్యవసాయ సాగు రైతులు, సిబ్బంది గురువారం సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తయారీపై అవగాహన కల్పించారు. అనంతరం అరుణ మాట్లాడుతూ నేలలు, పంటలు, పర్యావరణం, మన ఆరోగ్యం సమతుల్యంగా ఉండడానికి ఘనజీవామృతం ఉపకరిస్తుందన్నారు. దేశీయ ఆవు పేడ, గోమూత్రం, బెల్లం, పుట్టమన్ను తదితర వాటిని కలిపి జీవామృతం తయారు చేస్తారని వివరించారు. వీటిని ఏడురోజులపాటు ఎండబెట్టి నిల్వ ఉంచి, ఎకరాకు 100 కిలోల వంతున దుక్కిలో వేయాలని సూచించారు. పంటసాగు చేసిన నెలరోజులకు మరోసారి జీవామృతం వేస్తే, ఆరోగ్యకరమైన పంటలు ఉత్పత్తి అవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ద్వారపురెడ్డి రమణ, ద్వారపురెడ్డి వెంకటలక్ష్మి, కాయల దేవి పాల్గొన్నారు.

'పాఠశాల పారిశుధ్య సిబ్బందికి కనీస వేతనం ఇవ్వాలి'



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రుత్తల శంకరరావు

అనకాపల్లి రూరల్ : పాఠశాలల్లో పనిచేస్తున్న పారిశుధ్య సిబ్బందికి కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రుత్తల శంకరరావు కోరారు. గురువారం అనకాపల్లి దొడ్డి రామునాయుడు భవనంలో నిర్వహించిన స్కూల్ శానిటేషన్ ఆయాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల్లో ప్రభుత్వం నియమించిన పారిశుధ్య సిబ్బంది ఉదయం 8.30 నుంచి సాయంత్రం 4 వరకు కీలకమైన విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. వారి కష్టానికి తగిన వేతనం ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. వీరి సేవలను ప్రభుత్వం గుర్తించాలన్నారు. శానిటేషన్ ఆయాలకు కనీస వేతనంగా నెలకు రూ.18 వేలు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. వీరందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సమస్యల సాధన కోసం శానిటేషన్ ఆయాలు ఐక్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పల్లా దేవి, రూప, నాగమణి, నూకరత్నం, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో చెరువుల పరిశీలన



బయ్యవరంలో చేపల చెరువు పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో రవికుమార్

కశింకోట : ఉపాధిహామీ పథకం పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో వి.వి.రవికుమార్ అధికారులను ఆదేశించారు. మండలంలోని చెరకాంలో సాగునీటి చెరువు, బయ్యవరంలో చేపల చెరువుల్లో ఉపాధి హామీ పథకంలో పూడికలు తీస్తున్నారు. ఈ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఉపాధికూలీలతో మమేకమై వారి సమస్యల్ని తెలుసుకున్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా సిబ్బందిని సూచించారు.

కేంద్రంలో అవినీతి రహిత పాలన



ఉపాధి కూలీలకు చెత్త డబ్బాలు అందిజేస్తున్న బీజేపీ నేతలు

అనకాపల్లి రూరల్ : కేంద్రంలో తొమ్మిదేళ్లుగా అవినీతిరహిత పాలన అందిస్తున్న ఘనత ప్రధాని నరేంద్ర మోదీకే దక్కుతుందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, తుమ్మపాల ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు అన్నారు. గురువారం తుమ్మపాలలో కేంద్రంలో బీజేపీ సాధించిన విజయాలు, సంక్షేమ కార్యక్రమాలపై సంబరాలు జరిపారు. ఉపాధి కూలీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మోడీ పాలనలో అంతర్జాతీయంగా దేశ ప్రతిష్ట ఎంతో పెరిగిందన్నారు. తొమ్మిదేళ్ల పాలనలో చేపట్టిన అనేక సంస్కరణలను ఆయన ఈ గుర్తు చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఎందరో పేద ప్రజలకు జీవన భృతి దొరుకుతోందన్నారు. గ్రామపంచాయతీలను బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిధులను నేరుగా సర్పంచుల ఖాతాల్లోనే జమ చేస్తోందన్నారు. ప్రపంచ దేశాలన్నీ భారతదేశం వైపు చూసేలా సుపరిపాలన అందించిన ప్రధాని మోదీయేనని పలువురు బీజేపీ నేతలు ప్రశంసించారు. అనంతరం స్వచ్ఛ భారత్‌లో భాగంగా 300 మంది ఉపాధి కూలీలకు చెత్త డబ్బాలను అందించారు. కార్యక్రమంలో ఆర్టీఐ సెల్ కన్వీనర్ చదరం రామరాజు, కిసాన్ మోర్చా నాయకుడు చదరం నూకనాయుడు, పార్టీ నియోజకవర్గ కన్వీనర్ బొడ్డేటి నాగేశ్వరరావు, పార్టీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొండబాబు మాస్టారు, అనకాపల్లి రూరల్ మండల అధ్యక్షుడు కప్పిరి తాతారావు పాల్గొన్నారు.

ఘనంగా పడమటమ్మ ఆలయ ప్రతిష్ట



కశింకోట : మండలంలోని పడమటమ్మ వారి ఆలయ ప్రారంభోత్సవ వేడుకను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని అలంకరించి వేద మంత్రాల నడుమ ప్రత్యేక పూజలు జరిపారు. పెద్ద ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ కలగా లక్ష్మి, సర్పంచ్‌లు కలగా గున్నయ్యనాయుడు, పరవాడ మంగ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలసాల కిషోర్, ఆలయ నిర్వాహకుడు పరవాడ రమణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నూతన ఉపాధ్యాయుల శిక్షణ



ఉపాధ్యాయుల శిక్షణ ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న డైట్ ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు

తుమ్మపాల : జాతీయ విద్యావిధానం అమలుపై ఉపాధ్యాయులకు పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలని డైట్ ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు అన్నారు. పట్టణంలోని జేఎంజే పాఠశాలలో గత నెల 15 నుంచి బృందాల వారీగా జరుగుతున్న ఉమ్మడి జిల్లా నూతన ఉపాధ్యాయుల అవగాహన, శిక్షణ కార్యక్రమం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాభివృద్ధికి అనేక పథకాలను అమలుచేస్తోందని కొనియాడారు. బోధనాంశాలకు సంబంధించి ఉపాధ్యాయులు తమ నైపుణ్యం పెంచుకుని విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించాలన్నారు. నిపుణ్ భారత్ కార్యక్రమం ఫౌండేషన్ తరగతుల్లో 1, 2 స్థాయిలోనే విద్యార్థులకు చదవడం, రాయడం, గణిత ప్రక్రియలపై నైపుణ్యం పొందేలా శిక్షణ అందించాలన్నారు. డిజిటల్ విద్యపై స్మార్ట్ టీవీ, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ నిర్వాహణపై అవగాహన ఉండాలన్నారు. జగనన్న విద్యాకానుక, అమ్మ ఒడి, గోరుముద్ద వంటి విద్యా పథకాల అమలును తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో 1998, 2008, 2018 డీఎస్సీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు



విద్యార్థులతో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వెంకటరావు

సబ్బవరం: విద్యార్థులు గ్రంథాలకు రావడం ద్వారా విజ్ఞానాన్ని వృద్ధి చేసుకోవచ్చని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకటరావు అన్నారు. సబ్బవరం శాఖా గ్రంథాయంలో వేసవి విజ్ఞాన శిబిరం గురువారం ఉత్సాహంగా సాగుతోంది. గురువారం శాఖా గ్రంథాలయాన్ని ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. వేసవి శిక్షణ శిబిరంలో నేర్చుకున్న అంశాల గురించి తెలుసుకున్నారు. విద్యార్థులె వేసిన డ్రాయింగ్, పెయింటింగ్‌లు చూసి వారి ప్రతిభను అభినందించారు. కార్యక్రమంలో సబ్బవరం గ్రంథాలయ అధికారి వి. శిరీషతో పాటు మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

భానుడి భగభగలు



ఎండ తాకిడికి వెలవెలబోయిన కశింకోట వారపు సంత

కశింకోట : మండల ప్రజలు గురువారం సూర్యతాపానికి ఉక్కిరిబిక్కిరయ్యాయి. ఈ ఏడాది అత్యధిక ఉష్ణోగ్రత 41 డిగ్రీల నమోదైనట్లు గూగుల్ తెలిపింది. ఉదయం 10 గంటల నుంచే వాతావరణం వేడెక్కింది. ఒక వైపు ఉక్కపోత, మరో వైపు వడగాడ్పులతో ప్రజలు సతమతమయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దాదాపు అంతా ఇళ్లకే పరిమితమయ్యారు. రాత్రైనా వేడి సెగలు తగ్గకపోవడంతో ప్రజలు ఇక్కట్లకు గురయ్యారు. ఎండ వేడిమికి ఇక్కడి వారపు సంత కూడా వెలవెలబోయింది.

నిరుపేద బాలికల జీవితాల్లో వెలుగు



సాధికారత బాలికలతో ఎంపీ సత్యవతి, ఎన్టీపీసీ ఉన్నతాధికారులు

- అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతి

పరవాడ: నిరుపేద బాలికల జీవితాల్లో వెలుగులు నింపే దిశగా బాలిక సాధికారత మిషన్ వర్క్‌షాపును నిర్వహించిన సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యాన్ని ప్రత్యేకంగా అభినందిస్తున్నామని అనకాపల్లి ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి అన్నారు. సింహాద్రి ఎన్టీపీసీలో మే 12న ప్రారంభమైన బాలిక సాధికారత మిషన్(జిమ్) వర్క్‌షాప్ గురువారంతో ముగిసింది. కార్యక్రమంలో ఎంపీ సత్యవతి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బాలికల్లో సృజనాత్మకత పెంపొందించడం, మానసిక, సామాజిక ఎదుగుదలకు ఈ వర్క్‌షాపు అనేక విధాలుగా దోహదపడుతుందన్నారు. వర్క్‌షాపును నిరుపేద బాలికలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ సూచించారు. మూడేళ్ల నుంచి నిర్వహిస్తున్న బాలిక సాధికారత వర్క్‌షాప్ లక్ష్యాన్ని సింహాద్రి ఎన్టీపీసీ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా వివరించారు. వర్క్‌షాప్‌పై అంకితభావంతో పనిచేస్తుందని జీజీఎం సిన్హా వివరించారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా దీపాంజలినగర్ టౌన్‌షిప్‌లో నాలుగు వారాల పాటు నిర్వహించిన బాలిక సాధికారత మిషన్ వర్క్‌షాపు వీడియోను ప్రదర్శించారు.

బాలికలు నిర్వహించిన వివిధ ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్ బి.రామారావు, ఓఅండ్ఎం జీఎం డి.పి.పాత్ర, రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, దీపిక లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు అంజూ సిన్హా, హెచ్ఆర్ హెడ్ రుమాధిశర్మ, బాలభారతి పాఠశాల విద్యార్థులు, సంస్థ అధికారులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితాలు దుర్భరం

సబ్బవరం: ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీఐ రంగనాథం సూచించారు.మండలంలోని వంగలి గ్రామంలోశాంతి కమిటీ సభ్యులతో కలిసి డ్రగ్స్ నిర్మూలన, గంజాయి, మత్తు పదార్థాల అనర్థాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. సీఐ రంగనాథం మాట్లాడుతూ మత్తుకు బానిసలైతే జీవితాలు దుర్భరంగా మారుతాయని చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ట్రిపుల్ రైడింగ్,హెల్మెట్ వాడకం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ వెంకటేశ్వరరావు,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గాలివానతో విద్యుత్ సరఫరాకు ఆటంకం



నేలబావిలో ఈత కొడుతూ సేదతీరుతున్న చిన్నారులు, పెద్దలు



బోరుచుట్టూ చేరిన మహిళలు



చిన్నారికి విసనకర్రతో విసురుతున్న వృద్ధుడు

- రోజంతా కరెంట్ లేక జనాలు ఇబ్బంది
- అంధకారంలో మగ్గిన 12 గ్రామాలు
- యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు

తుమ్మపాల : మండలంలో బుధవారం సాయంత్రం వీచిన పెనుగాలుల బీభత్సానికి రోజంతా విద్యుత్ సరఫరాకు తీవ్రఅంతరాయం ఏర్పడింది. దీంతో రంగంలోకి దిగిన ఆ శాఖాధికారులు గురువారం రాత్రి 7.30 గంటల సమయంలో విద్యుత్‌ను పునరుద్ధరించారు. దీంతో రాత్రంతా అంధకారంలో మగ్గిపోయిన గ్రామాల ప్రజలకు ఉపశమనం దక్కింది. సిబ్బంది తక్కువగా ఉన్నప్పటికీ రాత్రిపగలూ శ్రమించి, విద్యుత్ సరఫరా చేయగలగడంతో మండలవాసులు ఊపిరి పీల్చుకున్నారు.

అల్లాడిపోయారు

ఒక పక్క అధిక ఉష్ణోగ్రతలు, మరోపక్క ఉక్కపోతతో చిన్నారులు, వృద్ధులు చాలా ఇబ్బంది పడ్డారు. మోటార్లు, వ్యవసాయ బోర్లపై ఆధారపడ్డ గ్రామస్తులు పొలాల్లో ఉన్న దిగుబావుల వద్దకు పరుగులు తీశారు. తాగు నీటి కోసం వాటర్ క్యాన్లపై ఆధారపడ్డారు. ఇంట్లో మరుగుదొడ్లను వినియోగిస్తున్నవారు కాలకృత్యాలు తీర్చుకోవడానికి నానా యాతనపడ్డారు. రెండు రోజులు కూడా ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు పైనే ఉండటంతో ప్రజలు, పశువులు ఉక్కిరిబిక్కిరయ్యారు. దీనికి తోడు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఫ్యాన్లు తిరగక.. ఆ బాధలు వర్ణనాతీతమని వాపోయారు. పగటి ఉష్ణోగ్రతలతో అల్లాడిపోయిన చిన్నాపెద్దలు వ్యవసాయ పొలాల్లోని నేలబావిలో ఈత కొడుతూ సేదతీరారు.

25 గంటలుగా నరకం

మండలంలోని పలు గ్రామాల్లో 25 గంటలపాటు విద్యుత్ అంతరాయం కొనసాగింది. బుధవారం రాత్రంగా సీహెచ్ ఎన్ అగ్రహారం, కోడూరు, మర్రిపాలెం, గొల్లపేట, భూపతి పాలెం, కాపుశెట్టివానిపాలెం, రేబాక, శంకరం, భట్లపూడి, గొలగాం, గోపాలపురం, అక్కిరెడ్డిపాలెం గ్రామాలు చీకట్లలోనే మగ్గాయి. ఇన్వర్టర్లు, చార్జింగ్ లైట్లు ఉన్నవారు కాస్త వెలుగులో ఉన్నారు. మిగిలిన వారు కొవ్వొత్తులు, దీపాల వెలుగులోనే గడిపారు.

పూర్తి స్థాయిలో పునరుద్ధరిస్తాం

జంగిల్ క్లియరెన్స్ చేయకపోవడంతో ఈ సమస్య ఏర్పడింది. గత సాయంత్రం బలమైన గాలులకు విద్యుత్ తీగలపై ఉన్న చెట్లకొమ్మలు విరిగిపడ్డాయి. సమస్యను తెలుసుకున్న మా సిబ్బంది రాత్రి నుంచి పనిచేస్తూనే ఉన్నారు. గురువారం సాయంత్రం చెట్లకొమ్మలు తొలగించారు. రాత్రి 8 గంటల్లోపు చాలా వరకు సరఫరాను పునరుద్ధరించాం.

– అశోక్, ఏఈ, ఈపీడీసీఎల్

ఆలయ నిర్మాణానికి విరాళాల అందజేత



విరాళం అందిస్తున్న సన్యాసిరావు

పరవాడ: నాయుడుపాలెం శివారు హనుమాన్‌నగర్‌లో శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ నిర్మాణం కోసం మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, లంకెలపాలెం వైఎస్సార్‌సీపీ సుందరపు శ్రీనివాసరావు విరాళంగా రూ.5116 చొప్పున అందజేశారు. కార్యక్రమంలో ఈ.లక్ష్మీప్రసాద్, ఎల్.అప్పలనాయుడు, ఎస్.సోమేశ్వరరావు, ఒ.అప్పారావు, అప్పలరాజు, కె.అప్పలనాయుడు, కె.చినసోమేశ్వరరావు పాల్గొన్నారు.